ఈనాడు
epaper.eenadu.net

# మేడ్చల్, శామీర్‌పేటకు మెట్రో

## మూడు నెలల్లో డీపీఆర్‌లు సిద్ధం చేయండి • హెచ్‌ఏఎంఎల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా ఉత్తర హైదరాబాద్ వాసులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రెండో దశలో భాగంగా మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో రైలు కారిడార్లను విస్తరించాలని నిర్ణయించింది. ఈ మార్గాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెట్రో అధికారులను ఆదేశించారు. డీపీఆర్‌లను మూడు నెలల్లోపు తయారుచేసి మెట్రో రైలు ఫేజ్-2 'బీ'లో చేర్చి కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపాల్సిందిగా సూచించారు. మెట్రో రైలు రెండోదశను రెండు భాగాల్లో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. మొదట 'ఏ' భాగంలో ఐదు మార్గాలను చేర్చింది. వీటి డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి అనుమతి కోసం గత ఏడాది కేంద్రానికి పంపించిన విషయం తెలిసిందే. రెండోది 'బి' భాగంలో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్‌సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన డీపీఆర్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ భాగంలోనే మేడ్చల్, శామీర్‌పేట కారిడార్లను కూడా చేర్చి కేంద్రానికి పంపాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విస్తరించాల్సిన రెండు కారిడార్ల డీపీఆర్ తయారీపై సీఎం రేవంత్‌రెడ్డి.. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిలతో బుధవారమిక్కడ ...మిగతా 2లో

ఈనాడు
epaper.eenadu.net

# మేడ్చల్, శామీర్‌పేటకు మెట్రో

(మొదటి పేజీ తరువాయి)

చర్చించి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

## ఏయే మార్గాల్లో..

- ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్‌కు దాదాపు 23 కిలోమీటర్ల మేర కారిడార్ పొడిగించాల్సి ఉంటుందని సీఎంకు హెచ్ఏఎంఎల్ ఎండీ తొలుత వివరించారు.
- జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట, తూంకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మెట్రో కారిడార్‌ను విస్తరించాలని సీఎంకు తెలిపారు.
- ఈ ప్రాంతం నుంచి గతంలో ఎంపీగా ప్రాతినిధ్యం వహించానని, తనకు ఇక్కడి ట్రాఫిక్ సమస్యలు, కారిడార్ మార్గాలపై అవగాహన ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నట్లు మెట్రో రైలు ఎండీ వివరించారు. విస్తరణ మార్గాల గురించి ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు.



బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

రెండు కారిడార్ల డీపీఆర్‌లను 3 నెలల్లో పూర్తిచేయాలని సీఎం సూచించినట్లు హెచ్ఏఎంఎల్ ఎండీ తెలిపారు. మెట్రో రెండోదశ 'ఏ' భాగంలాగే 'బీ' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. డీపీఆర్ తయారీ, మంత్రిమండలి ఆమోదం అనంతరం కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని సీఎం సూచించారని వెల్లడించారు. ఈ మేరకు డీపీఆర్, అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్లు వెల్లడించారు. మెట్రోరైలు తమ ప్రాంతానికి విస్తరించాలని ఉత్తర హైదరాబాద్ వాసులు కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సాధన సమితి పేరుతో పోరాటం చేస్తున్నారు. సీఎం తాజా నిర్ణయంపై వారు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

### ఇప్పటికే డీపీఆర్ ఆమోదం పొంది కేంద్రం పచ్చజెండా కోసం ఎదురు చూస్తున్నవి..

ఫేస్-2 (పార్ట్-ఏ)

నాగోల్-శంషాబాద్ విమానాశ్రయం (36.8 కి.మీ.లు)

రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.లు)

ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.లు)

మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.లు)

ఎల్బీనగర్-హయత్‌నగర్ (7.1 కి.మీ.లు)

పార్ట్-బీ

### డీపీఆర్ తయారీదశలో ఉన్నది..

శంషాబాద్ విమానాశ్రయం-ఫోర్త్‌సిటీ (40 కి.మీ.లు)

### డీపీఆర్ తయారు చేయాల్సినవి..

ప్యారడైజ్-మేడ్చల్(23 కి.మీ.లు)

జేబీఎస్-శామీర్‌పేట(22 కి.మీ.లు)